క్లుప్తంగా

సొంత ఖర్చుతో రోడ్డు మరమ్మతు



కెరమెరి: మండలంలోని ధనోరా మాజీ ఉప సర్పంచ్ రిజ్వాన్ సొంతఖర్చుతో రోడ్డుకు మరమ్మతు చేయించి మానవత్వం చాటుకున్నారు. మండలంలోని గోండ్‌గూడ పంచాయతీలోని ఇందాపూర్‌కు వెళ్లేదారిలో ఉన్న కల్వర్టు రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు సగభాగం కొట్టుకుపోయింది. అదేవిధంగా మట్టిరోడ్డుకు కోతకు గురైంది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గ్రామప్రజలు ఆయన దృష్టికి తీసుకెళ్లగా గురువారం సొంత ఖర్చుతో పొక్లయినర్ ద్వారా మరమ్మతు చేయించారు. దీంతో రాకపోకలు కొనసాగాయి.

షార్ట్ సర్క్యూట్‌తో షాపు దగ్ధం



దగ్ధమైన కిరాణా షాపు

దహెగాం: మండలంలోని హత్తిని గ్రామంలో మల్లన్నవాడకు చెందిన పెద్దల రాజయ్య కిరాణాషాపు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. రాజయ్య బుధవారం రాత్రి నిద్రిస్తున్న సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో కిరాణా షాపులో మంటలు వ్యాపించాయి. స్థానికులు గమనించి వెంటనే మంటలార్పిశారు. అప్పటికే ఫ్రిజ్, షాపులోని రూ.8 వేల నగదుతోపాటు సామగ్రి కాలిపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు పెద్దల రాజయ్య వేడుకుంటున్నాడు.

సన్మానం



కిరణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న బీజేపీ నేతలు

రెబ్బెన: ఇటీవల బీజేపీ జిల్లా కోశాధికారిగా ఎన్నికైన కొలిపాక కిరణ్‌కుమార్‌ను జిల్లా వన్ నేషన్ వన్ ఎలక్షన్ కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావు నివాసంలో పార్టీ నాయకులు గురువారం శాలువాతో సన్మానించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం, నాయకులు రాజన్న, దీపక్‌లు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

జైనూర్: నిరుపేదలకు ఆర్థికసాయం అందించడమే తమ లక్ష్యమని ఆత్రం మాన్విత శ్రీ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి ఆత్రం సునీల్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన ఆత్రం కృష్ణ ఇటీవల గాయపడ్డాడు. ఆసుపత్రి చికిత్స నిమిత్తం ఫౌండేషన్ తరఫున గురువారం రూ.14,920 ఆర్థికసాయం అందించారు. సర్పంచ్ ఆత్రం ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన రాకపోకలు

తిర్యాణి: మండలంలో బుధవారం ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి లోలెవల్ వంతెనపై వాగు ఉప్పొంగి ప్రవహించింది. మంగి, మాణిక్యపూర్, రొంపెల్లి, విజయనగరం గ్రామాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి



ఎద్దు కళేబరం

బెజ్జూర్: మండలంలోనీ ఎలుకపెల్లి గ్రామంలో బుధవారం రాత్రి విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి.. రైతు నీకురి భీమయ్య.. రాత్రివేళ పశువులను కొట్టంలో కట్టేసి ఉంచాడు. వర్షం రావడంతో విద్యుత్ తీగలు రేకులకు తగలడంతో షార్ట్ సర్క్యూట్‌తో ఎద్దు మృతి చెందింది. దీని విలువ రూ.30 వేల విలువ ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. ఘటన స్థలాన్ని లైన్‌మెన్ రాకిరే బాలాజీ పరిశీలించారు.



రెబ్బెన: వంకులంలో వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు



ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్‌లో..



రెబ్బెన: మట్టి వినాయకుడిని తీసుకువస్తున్న చిన్నారి

కొలువుదీరిన గణనాథులు

ఆసిఫాబాద్/రెబ్బెన/పెంచికల్‌పేట్/దహెగాం/కెరమెరి/కౌటాల/కాగజ్‌నగర్‌టౌన్/ఆసిఫాబాద్‌రూరల్: వినాయకచవితి పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా గణనాథులు కొలువుదీరాయి. తొమ్మిదిరోజుల పాటు విశేష పూజలందుకోనున్న గణపయ్యలకు దప్పుచప్పుళ్లు, బాజాభజంత్రీల మధ్య ఊరేగించి ప్రత్యేకంగా అలంకరించిన మండపాలకు తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. అర్చకుల మంత్రోచ్చరణాల మధ్య పూజా కార్యక్రమాలు చేపట్టారు. తొలిరోజు భక్తులు పూజలు నిర్వహించి ఉండ్రాళ్లు, లడ్డూ, పూలు పండ్లు నైవేద్యంగా సమర్పించారు. వివిధ ఆలయాలు, మండపాల్ల వద్ద అన్నదానం నిర్వహించారు. నిర్వాహకులు, యువకులు పాల్గొన్నారు.



దహెగాం శివాలయంలో..



కౌటాల: శిర్సాలో పూజలు చేస్తున్న చిన్నారులు



ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని బజార్‌వాడిలో సంఘసేవక గణేశ్‌మండలి వద్ద కాలనీ వాసులు



సిర్పూర్(టి)లో..



ఆసిఫాబాద్‌రూరల్: మోతుగూడలో



శ్రీ బాలాజీ వెంకటేశ్వర ఆలయం వద్ద అన్నదానంలో భక్తులు



కౌటాల: కన్నెపల్లిలో గణేశ్ విగ్రహాన్ని తీసుకువస్తూ..



కెరమెరిలోని శివాలయంలో గణేశ్ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు



కాగజ్‌నగర్‌టౌన్: శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో..

పాఠశాలల్లో చేరిన 'పదోన్నతి' ఉపాధ్యాయులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు వారికి కేటాయించిన పాఠశాలల్లో చేరారని విద్యాశాఖ అధికారులు గురువారం తెలిపారు. జిల్లాలోని స్థానిక సంస్థలు, ప్రభుత్వ పాఠశాలల్లో కలిపి 64 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు దక్కాయి. ఇందులో కొందరు మంగళవారమే కొత్త పాఠశాలల్లో చేరారు. 27 మంది పీఎస్ హెచ్‌ఎంలుగా ప్రమోషన్ పొందగా, 37 మందికి స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి లభించింది. బయోసైన్స్ 5, ఇంగ్లిష్ 4, గణితం 4, ఫిజికల్ ఎడ్యుకేషన్ 1, ఫిజికల్ సైన్స్ 4, సాంఘికశాస్త్రం 16 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు స్థానిక సంస్థల పాఠశాలల్లో భర్తీ కాగా. గణితం 1, సాంఘిక శాస్త్రం 2 స్కూల్ అసిస్టెంటు పోస్టులు ప్రభుత్వ పాఠశాలల్లో భర్తీ అయ్యాయి.

ఎస్పీఎం కాలుష్యంతో ఇబ్బందులు



కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ఎస్పీఎం పేపర్ మిల్లు కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గురువారం ఉదయం మిల్లు నుంచి కలుషిత వాయువులు వెలువడింది. లారీ చౌరస్తా నుంచి సర్‌సిల్క్ వెళ్లే మార్గం మొత్తం కలుషిత వాయువుతో నిండిపోయి రోడ్డు కనపడకుండా పోయింది. కలుషిత వాయువు వ్యాప్తితో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మట్టి వినాయకుల పంపిణీ



ఆసిఫాబాద్: వాసవీక్లబ్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీ



కాగజ్‌నగర్‌టౌన్: పద్మశాలి భవనంలో అందజేస్తున్న సీఐ ప్రేంకుమార్

ఆసిఫాబాద్: జిల్లాకేంద్రంలోని పలు ప్రాంతాల్లో గణనాథుడు కొలువుదీరాడు. మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో సీఐ బాలాజీ వరప్రసాద్ మట్టి గణపతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మట్టిగణపతులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్సై ఉదయ్‌రిన్, సంఘ నాయకులు వెంకన్న, గణపతి, సురేశ్, సదాశివ్, ప్రహ్లాద్, జక్కయ్య, పెంటయ్య, శంకర్, గోపాల్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ పాల్గొన్నారు. అంబేద్కర్ చౌక్ వద్ద లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మట్టివినాయకులు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు నాంపెల్లి శంకర్, సభ్యులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా, ఎన్టీఆర్ చౌరస్తా వద్ద మున్సిపల్ కమిషనర్ రాజేందర్, సిబ్బంది బుధవారం మట్టి గణపతులు విగ్రహాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రాజేందర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలు ప్రతిష్ఠించాలని కోరారు. పట్టణ పద్మశాలి భవనంలో పద్మశాలి భవన నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో సీఐ ప్రేంకుమార్ హాజరై మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మార్కెట్‌లో పంపిణీ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, మేనేజర్ మల్లయ్య, సిబ్బంది, పట్టణ పద్మశాలి భవన నిర్మాణ కమిటీ సభ్యులు సిందం చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా పోరాడుదాం

కెరమెరి: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల కోసం ఐక్యంగా పోరాడుదామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు క్రిష్ణమాచారి, పెర్క శ్రీకాంత్ అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వ అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

కార్యవర్గం ఎన్నిక..

సీఐటీయూ మండల కన్వీనర్ కె.ఆనంద్‌రావు అధ్యక్షతన కెరమెరి గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మడావి అనిల్, ఉపాధ్యక్షులుగా తొడొసం బాలు, సుర్పం శంకర్, నరేశ్, కార్యదర్శిగా తిరుసుల్ల సంతోష్, టేకం తిరుపతి, సహాయ కార్యదర్శులుగా చిప్పకుర్తి రాజేశ్, సిడాం జైవంత్, సభ్యులుగా వాసుదేవ్, భుజంగ్‌రావు, స్వామి ఎన్నికయ్యారు.



మాట్లాడుతున్న నాయకులు

ఓటర్ల జాబితా ప్రదర్శన

పెంచికల్‌పేట్: మండలాల్లోని ఎంపీడీవో, గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో గురువారం ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రదర్శించారు. పెంచికల్‌పేట్ ఎంపీడీవో కార్యాలయంతోపాటు 12 పంచాయతీ కార్యాలయాల్లో జాబితాను ప్రదర్శించినట్లు ఎంపీడీవో అల్బర్ట్ కోరారు. జాబితాలో అభ్యంతరాలు ఉంటే లిఖితపూర్వకంగా ఈనెల 30వ తేది వరకు అభ్యంతరాలను తెలియజేయాలని కోరారు.

లింగాపూర్: డ్రాఫ్ట్‌ఫొటో ఓటర్ల జాబితాలను అన్ని పంచాయతీ కార్యాలయంతోపాటు ఎంపీడీవో కార్యాలయ నోటీస్ బోర్డులపై ప్రదర్శించినట్లు ఎంపీడీవో రామచందర్, ఎంపీవో రజనీకాంత్ తెలిపారు.

సిర్పూర్(టి): మండలంలోని 16 పంచాయతీలకు సంబంధించిన డ్రాఫ్ట్ ఫొటో ఓటరు జాబితాలను ఎంపీడీవో సత్యనారాయణ ప్రదర్శించారు. మండలంలో 22,182 మంది ఓటర్లు ఉన్నారని, పురుషులు 11016, స్త్రీలు 11163, ఇతరులు 3 ఉన్నారని, ఏవైన అభ్యంతరాలుంటే ఈనెల 30వ తేదీలోపు అందించాలని సూచించారు.

కౌటాల: మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ముసాయిదా ఫొటో ఓటర్ల జాబితాను పంచాయతీ కార్యదర్శులు గురువారం విడుదల చేశారు. ఎంపీడీవో కోట ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు సాయికృష్ణ, రమేశ్, సునీత, సంధ్య, అనూష తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని 28 పంచాయతీలకు సంబంధించి వార్డుల వారీగా ముసాయిదా ఓటరు ఫొటో జాబితాను ఎంపీడీవో కోటప్రసాద్ గురువారం కార్యాలయంలో విడుదల చేశారు.

బెజ్జూర్: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం 22 గ్రామ పంచాయతీల డ్రాఫ్ట్ ఓటరు లిస్ట్, డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్లు అధికారులు వార్డుల వారీగా ప్రదర్శించారు. ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్లపై ఏవైనా అభ్యంతరాలు, సూచనలు ఉన్న పక్షంలో వాటిని ఈనెల 31లోగా సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు.



పెంచికల్‌పేట్: ఓటర్ల జాబితాతో పంచాయతీ కార్యదర్శులు

మంచం పట్టిన మెరెగూడ

- లోపించిన పారిశుద్ధ్యం
- విజృంభిస్తున్న వ్యాధులు
- ప్రతీ ఇంట్లో జ్వరపీడితులే

పెంచికల్‌పేట్: పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ లోపంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించింది. మురుగునీటితో తాగునీరు కలుషితం కావడంతో రోగాలు ప్రబలుతున్నాయి. పెంచికల్‌పేట్ మండలంలోని మెరెగూడ గ్రామంలో గత వారం రోజుల నుంచి జ్వరాలు ప్రబలడంతో ప్రజలు మంచం పట్టారు. 230 మంది జనాభా కలిగిన గ్రామంలో వైద్య సేవలందక అవస్థలు పడుతున్నారు. రోడ్డు సౌకర్యం లేక కనీసం ఆర్‌ఎంపీల వైద్యసేవలందడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పత్తా లేని అధికారులు

గ్రామంలో గత వారం నుంచి జ్వరాలు ప్రబలు తున్న ఇటు వైద్యశాఖ అధికారులు, అటు పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు గ్రామంలో మురుగునీరు నిలవడంతో దోమలకు ఆవాసంగా మారింది. దోమలు స్వైరవిహారం చేస్తుండటంతో గ్రామంలో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. జ్వరపీడితులు వైద్యం కోసం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని సుమారు 5 కి.మీ దూరం కాలినడకన బురదలో ప్రయాణించి పెంచికల్‌పేట్‌కు చేరుకుంటున్నారు.

వైద్యసిబ్బంది ఎక్కడ?

గిరి గ్రామంలో పెద్దఎత్తున విషజ్వరాలతో అవస్థలు పడుతున్నారు. జ్వరపీడితులకు సకాలంలో వైద్యం అందించాల్సిన అధికారులు జాడ లేదు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి జ్వరాలను అదుపులో ఉంచాల్సిన వైద్యసిబ్బంది పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరణాలు సంభవించకముందే వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి

వర్షాలకు పారిశుద్ధ్యం లోపించింది. గ్రామంలో పెద్దఎత్తున విషజ్వరాలు ప్రబలాయి. వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని అధికారులకు పలుమార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదు. వైద్యం కోసం సుమారు 5 కి.మీ బురదలో కాలినడకన ప్రయాణించి వైద్యం కోసం పరుగులు తీస్తున్నాం. అధికారులు వైద్యశిబిరం ఏర్పాటు చేయాలి.

– దుర్గం బాపు, మెరెగూడ

ఇష్టానుసారంగా విక్రయాలు

- పురుగు, ఎరువుల మందులు
- లాభార్జనే ధ్యేయంగా ఫర్టిలైజర్ల షాపులు
- నమ్మి మోసపోతున్న రైతులు
- రెండేసి మందులు కలిపి పంటకు పిచికారీ
- పంట నాశనమైందని ఆవేదన



ఎర్రబడిన పత్తి పంట

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులు లాభార్జనే ధ్యేయంగా ఇష్టానుసారంగా రైతులకు పురుగు, ఎరువుల మందులు విక్రయిస్తోంది. ఆ షాపుల యజమానులు రెండేసి మందులు కలిపి పంటకు పిచికారీ చేయాలని చెబుతుండడంతో కొందరు రైతులు నమ్మి మోసపోతున్నారు. వాటితో పిచికారీ చేస్తే పంట నాశనం అవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం తన పత్తి పంట ఎర్రబడిందని అంకుసాపూర్ గ్రామ రైతు బోయిన మల్లేష్ జిల్లా కేంద్రంలోని హసన్ ఫర్టిలైజర్ షాపు ఎదుట ఆవేదన వ్యక్తం చేశాడు. ఇటీవల పత్తికి రూ.5100తో మందు కొనుగోలు చేసి తన 9 ఎకరాల్లో ఈనెల 22న మందు పిచికారీ చేశాడు. మరుసటి రోజు పత్తి ఆకులు ఎర్రబడి రాలిపోయాయి. ఈ విషయమై సంబంధిత షాపు యజమానిని అడిగితే తనకు సంబంధం లేదని, కంపెనీ వారు వచ్చి చూస్తారని సమాధానమిచ్చాడు. జరిగిన నష్టానికి కంపెనీ పరిహారం ఇవ్వాలని రైతు కోరుతున్నాడు. గొల్లగూడ గ్రామానికి చెందిన రైతుకు సైతం ఇదే సమస్య ఎదురైంది. ఈ విషయమై ఏడీఏ మిలింద్ కుమార్‌ను సంప్రదించగా రైతులకు అవగాహన లేక హైడోస్ రెండేసి మందులు కలిపి పిచికారీ చేస్తున్నారని తెలిపారు. అంకుసాపూర్ రైతు బైఫిన్ మందు ఒకటే పిచికారీ చేయాలి కాని రైతు రెండు కలిపి కొట్టడంతో పత్తి పంట ఎర్రబడిందన్నారు. షాపులో చెప్పిన విధంగా చేశానని సదరు రైతు తెలిపాడు. గురువారం జిల్లా కేంద్రంలోని ఫర్టిలైజర్ యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం కేటాయించిన ధరలకే రైతులకు విత్తనాలు, ఎరువుల మందులను విక్రయించాలన్నారు. నియమ నిబంధనలను పాటించనివారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థులకు అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

ఆసిఫాబాద్‌రూరల్: మానవ అక్రమ రవాణా నిర్మూలించడం మన అందరి బాధ్యతని జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు గురువారం అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థుల హక్కులు, విధులపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రిన్సిపాల్ మహేశ్వర్, ప్రాజెక్టు మేనేజర్ చంద్రయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీవాలపై శ్రద్ధ పెట్టాలి

కౌటాల: జీవాల ఆరోగ్యంపై పోషకులు ప్రత్యేకశ్రద్ధ పెట్టాలని కౌటాల పశువైద్యాధికారి ఎన్.శ్రీకాంత్ అన్నారు. మండలంలోని సాండ్గాం గ్రామంలో మేకలు, గొర్రెలకు గురువారం పీపీఆర్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 రోజుల పాటు మేకలు, గొర్రెలకు ఉచితంగా ఈ టీకాలు వేస్తామన్నారు. పోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సిబ్బంది భిక్షపతి, సందీప్, రైతులు ఉన్నారు.

జాతీయస్థాయికి ఎదగడం అభినందనీయం

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని ఒక మారుమూల గ్రామం నుంచి నిరుపేద కుటుంబానికి చెందిన ఆదివాసీ గిరిజన యువతి పెందూర్ దీపాలక్ష్మి జాతీయస్థాయి పుస్తక రచయితగా ఎదగడం ఆదివాసీ సమాజానికి గర్వకారణం అని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పెందూర్ సంతోష్ అన్నారు. బెంగళూర్‌లో ఐదు రోజులపాటు జాతీయ పుస్తక రచయిత శిక్షణ కార్యక్రమాన్ని ముగించుకుని స్వగ్రామానికి వచ్చిన ఆమెను గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు జుగ్నాక కేశవ్ రావు, శంకర్, గ్రామస్తులు రవీందర్, నాగేందర్, జగన్నాథ్, శేఖర్, రాజేందర్, దేవయాని పాల్గొన్నారు.